క్లుప్తంగా

వైభవంగా శని దేవుని విగ్రహ ప్రతిష్ట



శని దేవుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పురపాలక సంఘం పరిధిలోని చింతకుంట గ్రామంలో శని దేవుడి విగ్రహ ప్రతిష్టోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచనం, రక్షాబంధనధారణ, మండపారాధనలు, అగ్నిప్రతిష్ట, జలాధివాసం, క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సల్లా రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆళ్లగడ్డ శ్రీప్రణవి హాస్పిటల్ డాక్టర్లు హాజరై 110 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో స్త్రీవ్యాధినిపుణురాలు డాక్టర్ రజిత, సల్లా స్వచ్ఛంద సేవా నిర్వాహకులు డాక్టర్ నరసింహా ప్రసాద్, సర్పంచ్ రామ్లా నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

శిరివెళ్ల: ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా చదువు చెప్పాలని డిప్యూటీ ఈఓ శంకరప్రసాదు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మోడల్ స్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గతంలో స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లకు పాఠశాలలోని నలుగురు టీచర్లు ఉంటే అందులో ఇద్దరు ఒక రోజు, మరో ఇద్దరు మరో రోజు హాజరయ్యేవారన్నారు. అలా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఉదయం వరకు స్కూల్ నడిపి, మధ్యాహ్న భోజనం అనంతరం టీచర్లందరూ కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరయ్యేలా మార్పు చేసిందన్నారు. ఈ మార్పును టీచర్లు స్వాగతించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎంఈఓ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఈఓ

మహానంది: మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ కలెక్టర్ రాజకుమారి గణియాకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆహ్వాన పత్రిక అందించారు. శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. మహానందిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ నెల 18న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో రెండో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి ఈఓ తీసుకెళ్లారు.

మహానందిలో పెళ్లిసందడి



మహానంది: మహానందిలో శనివారం పెళ్లిళ్ల సందడి నెలకొంది. మాఘమాసం కావడంతో మంచి ముహూర్తాలు ఉండటంతో పలు ప్రాంతాల వధూవరులు మహానందీశ్వరుడి సన్నిధిలో వివాహాలు చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఓ వివాహానికి అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించారు.

తపాలా బాదుడు షురూ

బుక్‌పోస్ట్ సర్వీసుల రుసుం పెంపు పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. ఈ సర్వీసుకు మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనీ ఆర్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ బుక్‌పోస్ట్‌పై భారీగా షాక్ ఇచ్చింది. దీంతో వార, పక్ష, ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడాపై ధరల మంట మండింది.



- పోస్టల్ చార్జీలు భారీగా పెంపు
- పుస్తక ప్రియులపై పిడుగు

నంద్యాల(న్యూటౌన్): బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో ఇంత కాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్ పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్‌పోస్ట్‌ను బుక్ పోస్టుగా మార్చి సేవల చార్జీ పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్ కార్డులను ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమును గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ప్రైవేట్ సేవలతో పోలిస్తే..

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఇప్పటి వరకూ తపాలా శాఖ తక్కువ ధరలతో తరలింపు సేవలు అందిస్తోంది. కానీ నూతన కఠిన నిర్ణయాలతో ప్రైవేట్ కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్ గతంలో రూ.80 చెల్లించేవారని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్టర్ బుక్‌పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాలా శాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్ట్‌లో తెప్పించుకోవాలంటే రూ.80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

దిగుమతి సుంకంపై ఆందోళన

శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా.. కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పుస్తకాలకు దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న కొత్త నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ఇలా చేయడం సరికాదు. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు, తెప్పించుకు నేదెవరు. ఇప్పటికైన కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– అన్నెం శ్రీనివాసరెడ్డి, రచయిత, నంద్యాల

బుక్‌పోస్ట్ బరువు	పాత ధర	కొత్త ధర
100గ్రాములు	రూ.22	రూ.28
1 కేజీ	రూ.27	రూ.92
2 కేజీలు	రూ.43.50	రూ.163
3 కేజీలు	రూ.56.40	రూ.234
4 కేజీలు	రూ.67	రూ.304
5 కేజీలు	రూ.79	రూ.365

ఆలయ షాపుల వేలం పాటలు రద్దు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానం ఆవరణంలో శనివారం నిర్వహించిన షాపుల బాడుగ వేలం ప్రకటన వాయిదా పడింది. ఈ సందర్భంగా కార్యనిర్వాహణ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 5 షాపులకు వేలం పాటలు నిర్వహించగా.. ఒక షాపు కాంట్రాక్టర్ విజయ్‌కుమార్ హైకోర్టుకు వెల్లడంతో వేలం పాట ఆగిపోయిందన్నారు. మిగతా షాపులకు వేలం పాట నిర్వహిస్తామంటే పాటదారులు ఒప్పుకోలేదన్నారు. మరో పదిరోజుల్లో అధికారులతో సంప్రదించి అన్ని షాపుల వేలం పాట నిర్వహిస్తామన్నారు.

చందలూరు చేరిన పార్వేట పల్లకీ



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులు జ్వాలానరసింహా స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ శనివారం చందలూరుకు చేరుకుంది. గ్రామ శివారులోకి పల్లకీ రాగానే గ్రామ పెద్దలు ఎదురేగివెళ్లి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోకి స్వాగతించారు. స్వామిరాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రతి విద్యార్థి పాస్ కావాలి

- డీఈఓ జనార్దన్‌రెడ్డి

శిరివెళ్ల: పదో తరగతి పరీక్షలలో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా బోధన చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, వీరారెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. వంద రోజుల ప్రణాళిక అమలుపై ఆయా పాఠశాలల హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది మాదిరిగా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీబీవీ ప్రిన్సిపాల్ జ్యోత్స్నకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

వీరారెడ్డిపల్లెకు చేరుకొని అక్కడ స్టడీ అవర్‌ను పరిశీలించారు. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని హెచ్ఎం మధురవాణికి సూచించారు.

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములై పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ మొదలుకొని అన్ని సెక్షన్ల గదులను, కలెక్టరేట్ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టరేట్ పరిసరాల్లో ఉన్న చెత్తను, ప్లాస్టిక్‌ను ఏరి వేశారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు వేరు చేయడం ముఖ్యమన్నారు. ఇందులో భాగంగా ఆకుపచ్చ డస్ట్ బిన్‌లో తడి చెత్తను, నీలం రంగు డస్ట్ బిన్‌లో పొడి చెత్తను, ఎరుపు రంగు డస్ట్ బిన్‌లో ప్రమాదకర, రసాయనిక వ్యర్థాలను వేసి చెత్త సేకరణకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. నంద్యాల జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీఆర్ఓ రాము నాయక్, ఏఓ రవికుమార్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది, కలెక్టరేట్‌లో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులు చేస్తున్న కలెక్టర్, జేసీలు

ప్రతి రైతు గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని, గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలు పారదర్శకంగా అందనున్నాయని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. నంద్యాల మండలం పాండురంగాపురం, చాపిరేవుల, పుసులూరు గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ చెల్లింపులు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, పెట్టుబడి సాయం తదితర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి గుర్తింపు సంఖ్య అవసరమవుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుర్తింపు సంఖ్య కోసం ప్రతి రైతు ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు, భూ రికార్డుల వివరాలు తీసుకొని సచివాలయాల్లో గుర్తింపు కార్డు పొందాలన్నారు.

రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై ఉంచండి

బొమ్మలసత్రం: అన్నమయ్య జిల్లాలో గౌతమిపై టీడీపీ నాయకుడి కుమారుడు గణేష్ యాసిడ్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై ఉంచాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై 300కు పైగా అఘాయిత్యాలు చోటుచేసుకున్నాయన్నారు. రాష్ట్ర హోమ్‌మినిస్టర్ మహిళ ఉండి కూడా మహిళలకు రక్షణ కల్పించటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆడపిల్లల జోలికొస్తే తాను తాటతీస్తానని స్టేజీలపై ఊగిపోయిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించి, బాధితురాలిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- డీఎస్పీ రామాంజి నాయక్



గ్రామసభలో ప్రసంగిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. మండల పరిధిలోని కరివేన గ్రామంలో శనివారం రాత్రి జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సెల్‌ఫోన్‌లలో వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఇతరెలెవరికీ ఓటీపీలు పంపరాదన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. మతసంబంధమైన విషయాల పట్ల సున్నితంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ సీఐ రాము పాల్గొన్నారు.

యాగంటి ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రం ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. వేలం పాటలో ఐదుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొనగా పాతపాడు గ్రామానికి చెందిన మధుసుధాకర్ అత్యధికంగా రూ.11.65 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ వెల్లడించారు. వేలం పాట పర్యవేక్షణాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, యాగంటి పల్లె గ్రామ ఉపసర్పంచ్ బండిమౌలిశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేదల పట్టాలను లాక్కోవడం తగదు

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కానాల గ్రామంలోని పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా లాక్కోవటం తగదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం కోసం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. కానీ గత ప్రభుత్వంలో అర్హులకు ఇచ్చిన పట్టాలను కొందరు టీడీపీ నాయకులు లాక్కోవాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. అలాగే నంద్యాల పట్టణ ప్రజల కోసం గత ప్రభుత్వంలో కుందూనది శివారు ప్రాంతాల్లో పట్టాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు అందులో మట్టిని అక్రమంగా తవ్వి వాటిని నివాసాలకు పనికిరాకుండా చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నవారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానాల గ్రామంలో కొత్తగా ఇంటి పట్టా కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని టీడీపీ నాయకులు బేరాలు ఆడుతున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

అంధ విద్యార్థులకు నిత్యావసర కిట్లు పంపిణీ



నిత్యావసర కిట్లను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణలో స్థానిక సెయింట్ లూక్స్ అంధుల వసతి గృహంలో అంధ విద్యార్థులకు శనివారం నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నిజాముద్దీన్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దృష్టిలోప దివ్యాంగులు తమ దృష్టిలోపాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో బ్రెయిలీ లిపి సహకారంతో బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు మేడా చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని నిత్యావసర కిట్లు, దోమల నివారణకు మస్కిటో కాయిల్స్ పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సిరిగిరి రమేష్, నాగరాజు, యూసుఫ్, చంద్రశేఖర్, సురేష్, దువాన్స్ రామ్, హిమజ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, గురురాఘవేంద్ర బ్యాంకింగ్ విద్యాసంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి హాజరయ్యారు. 2023–24లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఉన్నత స్థాయిలో స్థిరపడిన ఐదుగురు పూర్వ విద్యార్థులను సత్కరించారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ తమ కృషి, శ్రమ, పట్టుదలకు జాతీయ స్థాయి అవార్డులే నిదర్శనమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న దస్తగిరిరెడ్డి. చిత్రంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్

బీజేపీ బలోపేతానికి కృషి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సూచించారు. శనివారం నంద్యాలకు చేరుకున్న మంత్రికి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్, అమరావతి అభివృద్ధితో పాటు పోలవరం నిర్మాణానికి రూ.వేల కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

- డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల అర్బన్/న్యూటౌన్/వ్యవసాయం/గోస్పాడు: పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరి బాధ్యత అని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఆవరణంలో చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు కాంతారావునాయక్, సుదర్శన్‌బాబు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

➤ నంద్యాల కోర్టు ఆవరణంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర పురస్కరించుకుని జడ్జిలు రాధారాణి, లక్ష్మి, కిరణ్‌కుమార్, ఏసుదాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు భూపని వెంకటేశ్వర్లు, సిబ్బంది కలిసి కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు.

➤ నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణంలోనూ ఇంటర్ విద్యాధికారి సునీత అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి పిచ్చిమొక్కలను తొలగించి, పరిశుభ్రత పనులు చేపట్టారు.



జిల్లా కేంద్రంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

➤ స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో ఉద్యోగులతో జిల్లా విద్యుత్ శాఖ ఈఈ సుధాకర్ కుమార్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈ రామయ్య పాల్గొన్నారు.

➤ పోలూరు గ్రామంలో సొసైటీ ఆవరణంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

➤ గోస్పాడులో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ అమానుల్లా, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు.



కోర్టు ఆవరణంలో శుభ్రం చేస్తున్న జడ్జిలు రాధారాణి, లక్ష్మి

మండల పరిధిలోని సచివాలయాల్లో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారుల ఆధ్వర్యంలో అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. దీబగుంట్ల, జులేపల్లె గ్రామాల్లో ఎంపీడీఓ, యాళ్లూరు సచివాలయ పరిధిలో తహసీల్దార్ పాల్గొన్నారు.

➤ **ఉయ్యాలవాడ:** ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోలీస్ స్టేషన్లలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

➤ **దొర్నిపాడు:** స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద పరిశుభ్రత పనులు చేపట్టారు. ఎస్ఐ హనుమంతురెడ్డి సిబ్బందితో కలిసి స్టేషన్ ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ సావిత్రి, సర్పంచుల వెంకటేశ్వర్లు, మాధవీలత, మాధవీ, శివరామిరెడ్డి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శి ఓబులేసు, నాగర్జున, మహేష్ పాల్గొన్నారు.

➤ **శిరివెళ్ల:** మండల కేంద్రం శిరివెళ్లలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ పుష్పకుమారి పాల్గొన్నారు.

➤ **చాగలమర్రి:** మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎపీడీఓ రాజేంద్రప్రసాద్, మండల ప్రత్యేక అధికారి ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవికుమార్, ఈఓపీఆర్డీ తాహెర్ హుస్సేన్ పాల్గొన్నారు.